చెంతనే సేవలు.. ఆనందంలో గిరిజనులు


బొర్రా సచివాలయం వద్ద గిరిజనులు


వెల్‌నెస్ సెంటర్

- కోట్లాది రూపాయలతో గ్రామ సచివాలయ భవనం, ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్లు
- పక్కాగా భవనాల నిర్మాణాలు
- హర్షం వ్యక్తం చేస్తున్న గిరిజనులు

అనంతగిరి: గతంలోని పంచాయతీ కార్యాలయాలు వర్షాలకు కారుతూ.. ఎండకు ఎండుతుండే పరిస్థితి ఉండేది.. పలుచోట్ల వర్షాలు కారణంగా రిజిస్టర్లు, తదితర విలువైన రికార్డులు తడిసిపోయే పరిస్థితి సైతం ఉండేది....సౌకర్యాలు లేకపోవడం ఉద్యోగులు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు.. దీంతో పాటు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జనన, మరణ, కుల తదితర ధ్రువీకరణ పత్రాలు పొందేందుకు రోజుల తరబడి కార్యాలయాలు, అధికారుల చుట్టూ తిరగాల్సి వచ్చేది.. చంద్రబాబు పాలనలో జన్మభూమి కమిటీలతో పాటు టీడీపీ నాయకులు ధ్రువీకరణ పత్రాల కోసం అక్రమంగా సొమ్ములు వసూళ్లు చేసేవారు.. గడువు దాటిపోయినా పత్రాలు అందక విద్యార్థులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అలాంటి సమస్యలన్నీకి చెక్‌పెట్టేలా.. ప్రజలకు మెరుగైన పాలన అందించేందుకు, బాపూజీ కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చారు. గ్రామ సచివాలయ వ్యవస్థలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. ఫలితంగా ప్రభుత్వ సేవలన్నీ ప్రజల చెంతకే అందుతున్నాయి. దీంతో గ్రామ పంచాయతీల్లోనే పక్కాగా భవనాల నిర్మాణాలను చేపట్టేందుకు పెద్ద ఎత్తున కృషి చేసింది.. అన్ని వర్గాల ప్రజల కోసం సచివాలయం, అన్నదాతకు అండగా రైతు భరోసా కేంద్రాలు, ఆరోగ్యానికి వెల్‌నెస్ కేంద్రాలకు అవసరమైన భవనాలను పూర్తిస్థాయిలో నాణ్యతా ప్రమాణాలతో నిర్మిస్తున్నారు. వీటి కోసం ప్రభుత్వం కోట్లాది రుపాయలను ఖర్చు చేస్తోంది. నియోజకవర్గంలోని 115 సచివాలయాలకు గాను 28 పూర్తయ్యాయి. 115 రైతుభరోసా కేంద్రాలకు గాను 28 పూర్తయ్యాయి. 71 వైఎస్సార్ వెల్‌నెస్ కేంద్రాలకు గాను రెండు పూర్తయ్యాయి. మిగిలినవన్నీ నిర్మాణ పనులు వేగవంతంగా సాగుతున్నాయి.. గ్రామ సచివాలయాలకు అనుబంధంగా రైతు భరోసా కేంద్రాలు, గ్రామీణ ఆరోగ్య కేంద్రాలకు సైతం సొంత భవనాలు సమకూర్చేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఒక్కో సచివాలయం భవనానికి సుమారు రూ.43.60 లక్షలు, ఆర్‌బీకేకు సుమారు. 23.94 లక్షలు, గ్రామీణ ఆరోగ్య కేంద్రాలకు సుమారు. 20.80 లక్షల వరకు కేటాయించింది.

శరవేగంగా పనులు

నియోజకవర్గం వ్యాప్తంగా చేపడుతున్న భవనాలన్నీ త్వరితగతిన పూర్తిచేసేందుకు అధికారులు శ్రమిస్తున్నారు. దీనిపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారులు ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఉన్నతాధికారులు నిరంతరం పర్యవేక్షణలో ఎటువంటి అవకతవకలు చోటు లేకుండా పనులు చేపడుతున్నారు. గతం కన్నా మెరుగైన పాలనకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాంది పలకడం. ప్రభుత్వ సేవలు అందుబాటులోకి వస్తుండడంతో మారుమూల గిరిజనుల సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు.


అనంతగిరి సచివాలయంలో గిరిజనులకు సేవలందిస్తున్న సిబ్బంది



అరకులోయలో రైతు భరోసా కేంద్రం

ముంగిటకే ప్రభుత్వ సేవలు



గత టీడీపీ ప్రభుత్వ హయంలో ధ్రువీకరణ పత్రాల కోసం నానా అవస్థలు పడ్డాం. ఒక్క సర్టిఫికెట్ పొందేందుకు రోజుల తరబడి వేచి ఉండాల్సి వచ్చేది. నేడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా కొన్ని గంటల్లోనే సర్టిఫికెట్లు అందుతున్నాయి. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుల ముంగిట సేవలందుతున్నాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో అందరికీ అన్ని సేవలు చేరవయ్యాయి.

– సన్యాసిరావు, సుంద్రీ దంపతులు, ఎగువశోభ, అనంతగిరి మండలం

నాణ్యత ప్రమాణాలతో పనులు

మండలంలోని అన్ని చోట్ల గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్‌నెస్ సెంట ర్లు నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నాం. ప్రభుత్వం విడుదల చేసిన నిధుల తో నిర్మాణాలు గడవులోగా పూర్తి చేయనున్నాం. నాణ్యత ప్రమాణాలతో పనులు చేపట్టే విధంగా పర్యవేక్షిస్తున్నాం. ఎప్పటికప్పుడు విస్తృతంగా తనిఖీలు చేస్తున్నాం.

– రామం, డీఈఈ, పంచాయతీ రాజ్, అరకు డివిజన్

క్లుప్తంగా

కాఫీ హౌస్ ప్రారంభం


నిట్టాపుట్టులో కాఫీ హౌస్‌ని ప్రారంభించిన మేక్స్ సీఈవోలు

జి.మాడుగుల: మండలంలో కాఫీ రైతులు పండించే కాఫీని పౌడర్‌గా చేసి విక్రయించేందుకు పలు ఔట్‌లెట్లను అందుబాటులోకి తీసుకొచ్చినట్టు నిట్టాపుట్టు, గిరిమిత్ర, వేమలదుర్గా, జన జాగృతి మేక్స్ సీఈవోలు పి.గంగరాజు, కె.పిన్నయ్య, కె.సత్యనారాయణ, ఎస్.ఎ.శ్రీను చెప్పారు.మండలంలో నిట్టాపుట్టు గ్రామంలో మేక్స్ సీఈవోల ఆధ్వర్యంలో శుక్రవారం మేడికొండ కాఫీ హౌస్‌ని ప్రారంభించారు. కాఫీ పౌడర్ కావల్సిన వారు ఆన్‌లైన్‌లో బుకింగ్, లేదా నేరుగా తమ ఔట్‌లెట్ల ద్వారా అందజేస్తామన్నారు. మేక్స్ సిబ్బంది పాల్గొన్నారు.

పచ్చిరొట్ట సాగుతో మేలు


మాట్లాడుతున్న ఏవో ఉమాదేవి

కొయ్యూరు: పచ్చిరొట్ట విత్తనాలతో నేలలో భూసారం పెరుగుతుందని వ్యవసాయ అధికారి ఉమాదేవి సూచించారు. రావణాపల్లి రైతు భరోసా కేంద్రంలో వ్యవసాయ సిబ్బందితో ఆమె శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాలతో కలిగే లాభాలను రైతులకు వివరించాలని సూచించారు. ప్రతీ రైతు వాటిని వేసుకునే విధంగా చేయాలన్నారు.ప్రతీరైతు వత్తన శుద్ది చేసుకునే విధంగా సూచించాలన్నారు. విత్తనశుద్ధితో కలిగే మేలును రైతులకు చెప్పాలని సిబ్బందిని కోరారు. విత్తనాలు కూడా త్వరలో వస్తాయన్నారు. రైతులకు అవసరమైన మేరకు విత్తనాలను సిద్ధం చేస్తున్నామన్నారు.

సర్పంచ్ చొరవతో ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు


మరమ్మతు పనులు చేయిస్తున్న సర్పంచ్ సున్నం అభిరామ్

కూనవరం: చినార్కూరు పంచాయతీలోని తెల్లవారి గుంపులో గత రాత్రి ఉరుములు, మెరుపులతో కురిసిన భారీ వర్షానికి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పాడైంది. ఫలితంగా ఆగుంలోని గిరుజనులు విద్యుత్ సరఫరా లేక ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న సర్పంచ్ సున్నం అభిరామ్ స్పందించి విద్యుత్ అధికారులతో మాట్లాడి ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేయించారు. సమస్య పరిష్కరించిన విద్యుత్ అధికారులకు, సర్పంచ్‌కు అక్కడి గిరిజను ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఇంటర్ పరీక్ష కేంద్రం తనిఖీ


పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీఐ రమేష్

జి.మాడుగుల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలను శుక్రవారం సీఐ రమేష్ పర్యవేక్షించారు. ఇంటర్మీయెట్ పరీక్షా కేంద్రం వద్ద 144సెక్షన్ అమలు చేసే విధంగా పోలీస్ సిబ్బందికి ఆయన అవగాహన కల్పించారు. పోలీస్ ఆంక్షలు ధిక్కరిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. విద్యార్థులు పరీక్షలు రాస్తున్న గదులను ఆయన తనిఖీ చేశారు.

అనాథ విద్యార్థులకు ఉచిత విద్య

చింతపల్లిరూరల్: నిరుపేదలైన అనాథ విద్యార్థులకు ఉచిత విద్యతో పాటు పుస్తకాలు, యూనిఫామ్స్ అందించనున్నట్టు కింగ్స్ ఆర్మీ విద్యా సంస్థల చైర్మన్, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా జాతీయ అధికార ప్రతినిధి డెన్నీ తెలిపారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ తమ అనాథ విద్యార్థులకు తమ సంస్థ బాసటగా నిలుస్తోందన్నారు. చింతపల్లి, సత్తుపల్లిలో గల తమ విద్యా సంస్థల్లో ఈ సౌకర్యాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. విద్యార్థుల్లో నైపుణ్యం పెంపేందించేలా వివిధ పోటీ పరీక్షలకు కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్టు ఆయన తెలిపారు.

బాల్య వివాహాలతో అనర్థం


హుకుంపేటలో బాలికలతో మాట్లాడుతున్న సీడీపీవో బాలచంద్రమణిదేవి


కూనవరం అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న సీడీపీవో నాగలక్ష్మి

హుకుంపేట: బాల్యా వివాహాలకు దూరంగా ఉండాలని ఐసీడీఎస్ సీడీపీవో బాలచంద్రమణిదేవి అన్నారు. బేటీ భచావో.. బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండల కేంద్రంలోని స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో 11 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాలలోపు కిశోర బాలికలకు బాల్య వివాహాలు, సమాజంలో స్త్రీలు ఏ విధంగా ఉండాలో అన్న విషయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతు ఏజెన్సీలో బాల్య వివాహాల వల్ల అనర్థాలు కలుగుతాయని, ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. బాల్య వివాహాల అనర్థాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. సూపర్‌వైజర్లు హాసీనా, అప్పలనర్సమ్మ తదితరులు పాల్గొన్నారు.

కూనవరం: కిశోర బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు రుతుక్రమ శుభ్రతపై అవగాహన కలిగి ఉండాలని సీడీపీవో నాగలక్ష్మి చెప్పారు. రుతుక్రమ పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రుతుక్రమ పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై బాలికలు అవగాన కలిగి ఉండాలని, బాల్యవివాహాలను అరికట్టాలని సీడీపీవో అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. సూపర్‌వైజర్లు, వర్కర్లు పాల్గొన్నారు.

అమ్మవారికి జలాభిషేకం


అమ్మవారికి జలాభిషేకంలో పాల్గొన్న భక్తులతో సర్పంచ్ పూర్ణిమ

హుకుంపేట: మన్య ప్రజల ఆరాధ్య దైవమైన మోదకొండమ్మ అమ్మవారి జాతర సందర్భంగా అమ్మవారికి శుక్రవారం 101 బిందేలతో జలాభిషేకం కార్యక్రమం నిర్వహించారు. జూన్ నెల 16, 17, 18 తేదీల్లో జరగనున్న అమ్మవారి జాతరను పురస్కరించుకుని శుక్రవారం స్థానిక మహిళలు బిందెలతో పాలు, నీళ్లను తీసుకొచ్చి అమ్మవారికి అభిషేకం చేశారు. ప్రతి ఏడాది ఉత్సవాల్లో ఎటువంటి ఆటంకాలు జరగకుండా మండల వాసులు క్షేమంగా ఉండాలని ఆకాంక్షిస్తు ఈ జలాభిషేకాన్ని నిర్వహించచడం ఆనవాయితీగా వస్తుందని ఉత్సవ కమిటీ అధ్యాక్షుడు పాంగి అనిల్, సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ చెప్పారు. కార్యక్రమానికి అరుకు ఎమ్మెల్యే అభ్యర్థి రేగం మత్స్యలింగం ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ కమిటీ నాయకులు కొర్ర కాసులమ్మ, ప్రసాద్, గోవింద్, నాగు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

అనకాపల్లి: స్థానిక జార్జిక్లబ్ ఆవరణలో ట్రస్ట్ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక యోగాసనాలు, స్విమ్మింగ్ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ యోగాసనలు వేయడం ద్వారా చాలా వ్యాధుల నుంచి విముక్తి పొందవచ్చన్నారు. యోగా కేంద్రాల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. ద్వితీయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని మూడు రోజులపాటు పలు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.కార్యక్రమంలో భాగంగా ఈశ్వర్ స్విమ్మింగ్ పూల్‌లో శ్వాసపై ధ్యాస పెంపొందించేందుకు జలాసనాలు నిర్వహించినట్లు తెలిపారు. 25న యోగాపై అవగాహన కార్యక్రమాలు, 26న పతంజలి యోగపీఠ్, హరిద్వారకు చెందిన పూజ్యస్వామి రిత్ దేవ్ మహారాజ్ జీ, శ్రీనివాసులు విచ్చేయనున్నట్లు పేర్కొన్నారు. జోగినాయడు, కాశీవిశ్వనాథ్, చంద్రశేఖర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తుపాను షెల్టర్లలో సౌకర్యాలు మెరుగుపరచాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో ఫణీంద్రరెడ్డి

వీఆర్ పురం: గోదావరి వరదల సమయాల్లో వరద బాధితులు తలదాచుకునే తుపాను షెల్టర్‌లలో సౌకర్యాలు మెరుగుపరచాలని ప్రజాప్రతినిధులు కోరారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ కారం లక్ష్మీ ఆధ్వర్యంలో శుక్రవారం వీఆర్ పురం మండలం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజాప్రతినిధులు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. ఏటా జులై, ఆగస్టు నెలల్లో వస్తున్న వరదలకు ముంపునకు గురవుతున్న ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వరదల సమయంలో వరద బాధితులకు ఆశ్రయం కల్పించే పునరావాస కేంద్రాల్లో తాగునీరు, సోలార్ విద్యుత్ తదితర సౌకర్యాలను ఏర్పాటుచేసేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. మండలంలోని పోలవరం ముంపు గ్రామాల నిర్వాసితులకు ఇతర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన ఆర్అండ్ఆర్ కాలనీల్లో కూడా సౌకర్యాలు అంతంత మాత్రంగానే ఉన్నాయని అక్కడ కూడా పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు వాళ్ల రంగారెడ్డి, ఎంపీడీవో ఆర్.ఫణీంద్రరెడ్డి, తహసీల్దార్ సయ్యద్ మౌలానాఫాజిల్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సెక్రటరీలు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

పెదబయలు: స్థానిక ఏపీ గురుకుల రెసిడెన్సియల్ కళాశాల కేంద్రంలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభమైనట్టు ప్రిన్సిపాల్, చీఫ్ సూపరింటెండెంట్ కె.ఈశ్వరమ్మ తెలిపారు. కేంద్రంలో మొదటి రోజు పరీక్షకు 34 మందికి గాను 31 మంది హాజరైనట్టు చెప్పారు. మధ్యాహ్నం నలుగురు విద్యార్థులు పరీక్షలు రాసినట్టు పేర్కొన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా పరీక్ష కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించినట్టు చెప్పారు.

రైతులకు సేంద్రియ సాగు ధ్రువీకరణ పత్రాలు

చింతపల్లిరూరల్: గుర్తింపు పొందిన రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలకు ప్రభుత్వం నుంచి సేంద్రియ సాగు ధ్రువపత్రాలను జారీ చేయనున్నట్టు చింతపల్లి మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. మన రాష్ట్రంలో ఇప్పటి వరకు కొన్ని రకాల వ్యవసాయ ఉత్పత్తులు మాత్రమే విదేశాలకు ఎగుమతి అవుతున్నాయన్నారు. దాదాపు అత్యధిక ఉత్పత్తులన్నీ రైతులు దేశీయంగా విక్రయించుకోవాల్సిన పరిస్థితి ఉందన్నారు.ఈ మేరకు ప్రభుత్వం రాష్ట్ర సేంద్రియ ఉత్పత్తుల ధ్రువీకరణ సంస్థను ఏర్పాటు చేసిందన్నారు. ఈ సంస్థ ద్వారా గేప్ సర్టిఫికెట్‌ను సంఘాలకు అందించి రైతులు పండించిన ఉత్పత్తులను విదేశాలకు అధిక ధరలకు విక్రయించుకోవచ్చన్నారు. ఈ ధ్రువీకరణ పత్రాలకు ఆసక్తి కలిగిన రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు చింతపల్లి వ్యవసాయశాఖ కార్యలయాన్ని సంప్రదించవచ్చని ఆయన సూచించారు.

పశువ్యాధులపై అప్రమత్తం


పశువులకు టీకాలు వేస్తున్న సిబ్బంది

అనంతగిరి: కొనపురం పంచాయతీలోని కితలంగి, కర్రాయిగుడ, అటిమల, బొండుగుడ గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన వైద్య శిబిరంలో పశువులకు జబ్బువాపు, చిటుకు వ్యాధి నిరోధక టీకాలు వేసినట్టు పశువైద్యాధికారి సందీప్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ పశువ్యాధులపై రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. పశువులకు వ్యాధు లు సోకితే సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. సీజనల్ వ్యాధులు సోకకుండా పశువులకు ముందస్తుగా టీకాలు వేస్తున్నట్టు చెప్పారు. సిబ్బంది మూర్తి, శ్రీనివాసరావు, అప్పారావు, సుందరరావు,మూర్తి పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి


జి.మాడుగులలో ఎన్నికల నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న సీఐ రమేష్


పాతకోటలో గ్రామస్తులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ సాయికుమార్

జి.మాడుగుల: ఓట్ల లెక్కింపు రోజున ఎటువంటి అల్లర్లు, గొడవలు దిగినా, అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా ఎన్నికల నిబంధనలు మేరకు చట్టపరమైన చర్యలుంటాయని సీఐ రమేష్ తెలిపారు. స్థానిక సర్కిల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శుక్రవారం టీడీపీ నాయకులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నందున కౌంటింగ్ జరిగే ప్రదేశాల్లో గుంపులు గుంపులుగా ఉండడం, పార్టీ శ్రేణులను గుంపులుగా తరలించడం, సమావేశాలు నిర్వహించడం వంటివి చేయవద్దని ఆయన సూచించారు. ఓట్లు లెక్కింపు కేంద్రాల వద్ద 144సెక్షన్ అమల్లో ఉంటుందని పార్టీ కార్యకర్తలు, నాయకులు నిషేధించిన ప్రదేశాల్లో తిరగొద్దని కౌన్సిలింగ్ నిర్వహించారు. ఎన్నికల నియమావళిని అందరు పాటించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

ప్రశాంతంగా ఓట్ల లెక్కింపునకు సహకరించాలి

వై.రామవరం: జూన్ 4వ తేదీన నిర్వహించే ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహణకు అందరూ సహకరించాలని మండలంలోని గుర్తేడు పోలీసు స్టేషన్ ఎస్ఐ సాయికుమార్ కోరారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆ పోలీసు స్టేషన్ పరిధిలోని పాతకోట, గుర్తేడు గ్రామాల్లో అన్ని రాజకీయ పార్టీల నాయకులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. నాయకుల ఇళ్లకు వెళ్లి ఏ విధమైన ఆవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందు జాగ్రత్త చర్యగా నోటీసులు అందించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతు జూన్ 4న ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యేవరకు అందరూ ప్రశాంతంగా ఉండాలన్నారు. అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ర్యాలీలు వంటివి నిర్వహించొద్దన్నారు. జూన్ 5వ వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఈ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో నిర్వహణకు పలు సలహాలు సూచనలిచ్చారు.

30న ఆలయ భూములకు కౌలు వేలం

బుచ్చెయ్యపేట: వడ్డాదిలో మూడు దేవాలయాల భూములను మూడేళ్ల పాటు పాటు కౌలు చేసుకోవడానికి ఈ నెల 30న వేలం పాట నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఈవో శర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి 2027 మే 31వ తేదీ వరకు వేలం దక్కించుకున్న కౌలు రైతులు సాగు చేసుకోవచ్చన్నారు. వేంకటేశ్వరస్వామి ఆలయానికి సంబంధించి వడ్డాదిలో సర్వే నంబర్ 176-5ఏలో 5.50 ఎకరాలు, 176-5ఏలో 1.50 ఎకరాలకు రూ.10 వేలు ధరావత్తు ముందుగా చెల్లించి 30వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు ఆలయం వద్ద నిర్వహించే వేలంలో పాల్గొనాలన్నారు. మల్లికార్జునస్వామి ఆలయానికి సంబంధించి వడ్డాదిలో సర్వే నంబర్ 37-16లో 3.42 ఎకరాలు, 37-17లో 4.44 ఎకరాలకు రూ. 2 వేల వంతున ధరావత్తు ముందుగా చెల్లించి ఆలయం వద్ద 30వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు జరిగే వేలం పాటలో పాల్గొనాలన్నారు. వడ్డాది రామలింగేశ్వరస్వామి ఆలయానికి సంబంధించి విజయరామరాజుపేట రెవెన్యూలో సర్వే నంబర్ 4-21లో 2.63 ఎకరాలకు ధరావత్తు రూ.5 వేలు, సర్వే నంబర్ 4-25లో 50 సెంట్లకు రూ.2 వేలు ధరావత్తు ముందుగా చెల్లించి 30వ తేదీన ఉదయం 11 గంటలకు ఆలయం వద్ద జరిగే వేలం పాటలో పాల్గొనాలన్నారు. ఆ రోజు వేలంలో పాట పాడినవారు మొదటి సంవత్సరం సొమ్ము అదే రోజు దేవస్థానానికి చెల్లించాలని ఈవో సూచించారు.

ఘనంగా దుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం

కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డు కై లాసపురం పరిధి మధుసూదన నగర్‌లోని లక్ష్మీగణపతి, కనకదుర్గ అమ్మవారి ఆలయ 30వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు శ్రీనివాస్‌శర్మ నేతృత్వంలో సామూహిక కుంకుమ పూజలు, జల, క్షీరాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ సభ్యుడు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి పూజలు చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు, తిరువీధి మహోత్సవాలు నిర్వహించారు. పూజల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఆలయ చైర్మన్ శీరం శెట్టి శంకర్, కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.